ప్రజాశక్తి

బుధవారం 21 డిసెంబరు 2022 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

24/7 అందుబాట్లో

- పెనమలూరులో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - పెనమలూరు

మండలంలో పగలు రాత్రీ తేడా లేకుండా 24 గంటలూ మద్యం విక్రయాలు యధేశ్చగా జరుగుతున్నాయి. బెల్టు షాపులతోపాటు నేరుగా బారుల్లోనూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాలను మించి నిరంతరం మద్యం విక్రయిస్తున్నారు. విజయవాడ నగరంలోని షాపులతోపాటు నగరానికి సరిహద్దులో ఉన్న యనమలకుదురు, కానూరులో ఉన్న బారుల్లోనూ ఈ సంస్కృతి నడుస్తోంది. ఈ వ్యవహారం పోలీసులకు తెలిసినా అప్పుడప్పుడు బెల్టు షాపులపై పోలీసులు కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నైట్‌బీట్లో ఉండే కానిస్టేబుళ్ల చేతివాటం ప్రదర్శిస్తుండడంతో అర్ధరాత్రుళ్లు కూడా మద్యం విర్రయాలు సాఫీగా సాగిపోతున్నాయి. దీంతో అర్ధరాత్రి సమయంలో మద్యంబాబుల ఆగడాలకు అటుగా వచ్చే వారు బెంబేలెత్తిపోతున్నారు.

బెల్టు షాపులు

కొంతమంది బార్‌ల యజమానులు గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చిన్న తరహా దుకాణాలను ఎంచుకుని వారికి క్వార్టర్ బాటిల్‌కు ఎంఆర్‌పిపై సుమారు రూ.30లకు విక్రయించి అమ్మకాలు జరుపుతున్నారు. బెల్టు షాపుల వారు క్వార్టర్‌కు అదనంగా రూ.50 నుంచి రూ.80కు తీసుకుని విక్రయిస్తున్నారు. అధికారులు, బార్ యజమానుల మధ్య లావాదేవీలు కుదరడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం మద్యం ఏరులైపారుతోంది. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా తూతూమాత్రంగా దాడులు చేయడం మినహా పట్టించుకున్న వారే కరువయ్యారు. పెనమలూరు, తాడిగడప, యనమలకుదురు ప్రాంతాల్లో ఉన్న బార్లలో నిరంతరం మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే పలువురు సెక్యూరిటీగార్డులు, చిరు ఉద్యోగులు బార్ల వద్దకు వెళ్లి యధేచ్చగా మద్యం (మిగతా 6లో)

సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరు అరెస్టు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి జాషువా

నిందితులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, పెనమలూరు : మహిళపై సామూహిక అత్యాచారం కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా తెలిపారు. పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితురాలు చిన్న చిన్న పనులు చేసుకుంటూ బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ కింద బాట కోటి అనే వ్యక్తితో ఉంటోందన్నారు. శీను అనే పరిచయం ఉన్న నిందితునితో రెండురోజుల పాటు పనికి వెళ్లిందని, శ్రీనుతోపాటు నాగరాజు, రవి అనే మరో ఇద్దరూ బాధితురాలిపై అత్యాచారానికి (మిగతా 6లో)

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

బాధితురాలిని పరామర్శించిన ఐద్వా కృష్ణాజిల్లా కార్యదర్శి పి.జ్యోతి, నాయకులు ఆషా; షకీలా

మహిళను గదిలో నిర్భంధించి మూడు రోజులపాటు అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఐద్వా కృష్ణాజిల్లా కార్యదర్శి పి.జ్యోతి డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన మహిళను విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆమె పరామర్శించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ (మిగతా 6లో)

జిల్లా ఆర్థిక ప్రగతికి తోడ్పడండి

డిసిసి, డిఎల్‌ఆర్‌సి బ్యాంకర్లతో కలెక్టర్ డిల్లీ రావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించి భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు బ్యాంకర్లను కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూకమిటి (డిఎల్‌ఆర్‌సి) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను ఈఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.26,772 కోట్లకుగాను రూ. 29,945 కోట్ల రుణాలను మంజూరు చేసి 111.85 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు చెప్పారు. మొత్తం ప్రాధాన్యతా రంగాలకుగాను రూ.16,628 కోట్ల రుణ లక్ష్యంకాగా, రూ.10,231 కోట్ల రుణాలు మంజూరు చేసి 61.53 శాతం ప్రగతి సాధించినట్లు తెలిపారు. ప్రాధాన్యేతర రంగాలకు అదనంగా రూ.10,144 కోట్ల లక్ష్యానికిగాను రూ.19,714 కోట్ల రుణాలు అందజేసి 194.34 శాతం పురోగతి సాధించామన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.9,749 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఖరీఫ్‌లో రూ.5,515 కోట్ల రుణ లక్ష్యంతో రూ.4,310 కోట్ల రుణాలుగా అందించి 78.16 శాతం నమోదు చేశామని తెలిపారు. ఈ ఏడాది రూ.4,234 కోట్ల (మిగతా 6లో)



ప్రగతి నివేదికతో కలెక్టర్ డిల్లీరావు

గూడు..గోడు

- టిడ్కో గృహ ప్రవేశాలు వాయిదా
- పూర్తికాని మౌలిక వసతులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపి టిడ్కో) గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరు, జి ప్లస్ త్రీ గృహాలు నిర్మించిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఈ కాలనీల ప్రారంభాన్ని ప్రభుత్వం వాయిదా వేయాల్సి వచ్చింది. దీంతో సుదీర్ఘకాలంగా గృహాల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురైంది. ఎప్పటికి చేతికి అందుతాయో తెలియక లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

నత్తనడకన మౌలిక వసతుల పనులు

ఉమ్మడి కష్ణాజిల్లా వ్యాప్తంగా పెడన మినహా ఇతర పట్టణాలు, నగర పాలక సంస్థల్లో 96,138 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. 42,962 ఇళ్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సుదీర్ఘకాలంగా ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించింది. సిపిఎంతోపాటు ఇతర విపక్షాలు ఆందోళనలు నిర్వహించడంతో ప్రభుత్వం ఒకింత దిగి వచ్చింది. 64,714 టిడ్కో ఇళ్లను రద్దు చేసింది. 31,424 ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం కొనసాగించింది. ఈ గృహాల నిర్మాణాలను పూర్తి చేసి రంగులద్దింది. రోడ్లు, యుజిడి, సీవేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ), మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు, వాటర్ పైపులైన్లు, విద్యుద్దీపాలు వంటివి ఏర్పాటు

చేయాల్సి ఉంది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లకు సంబంధించి పనులను అసలు ప్రారంభించలేదు. యుజిడి, మంచినీటి వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ పోల్స్, లైన్లు ఏర్పాటు చేయడం జరగలేదు.

2016లో టిడ్కో గృహాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించింది. వారి నుంచి ముందస్తు డిపాజిట్లు తీసుకుంది. ఈపథకం కింద లబ్ధిదారులకు కేంద్రం ప్రభుత్వం రూ.1.50 లక్షల రాయితీ అందజేస్తోంది. ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఏ కేటగిరీ (300 చదరపు అడుగులు), బి కేటగిరీ (364 చదరపు అడుగులు), సీ కేటగిరీ (430 చదరపు అడుగులు) విస్తీర్ణంలో నిర్మించారు. ఏ కేటగిరీలోని ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేస్తోంది. బి కేటగిరీ గృహ నిర్మాణానికి రూ.7.65 లక్షలు ఖర్చువుతోంది. లబ్ధిదారుల వాటాగా రూ.50 వేలు చెల్లించారు. సీ కేటగిరీకి రూ.8.65 లక్షలు ఖర్చువుతోంది. లక్ష రూపాయలు లబ్ధిదారుని వాటాగా చెల్లించారు. ఈ రెండు కేటగిరీల్లోని లబ్ధిదారులు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణాలు సమకూర్చుకుని టిడ్కో సంస్థకు చెల్లించాలి. గుడివాడలో బిసి కేటగిరీకి సంబంధించి మొత్తం 7,328 మందికి రూ.263 కోట్ల రుణాలకుగాను రూ.163 కోట్లు, మచిలీపట్నంలో బి, సి కేటగిరీలకు సంబంధించిన 960 ఇళ్లకు రూ.34 కోట్లకుగాను రూ.14.01 కోట్లు మాత్రమే రుణాలు అందాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

పట్టణాల్లో అద్దెల భారం తగ్గించుకునేందుకు సొంత ఇల్లు సమకూర్చుకోవాలనే ఆశ నెరవేర్చుకోవడానికి ఈ పథకంలోని లబ్ధిదారులు అప్పులు చేసి వేలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించారు. కానీ నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ వారికి ఇళ్లు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇళ్ల అద్దెలతోపాటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీల గృహ సముదాయాల ప్రారంభం వాయిదా పడటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : రక్షణనిధి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మంగళవారం ఆయన పడమర

మాధవరంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు తాము వ్యవసాయ భూముల్లోకి వెళ్లనీయకుండా గ్రామానికి చెందిన ఒక భూస్వామి అడ్డుకుంటున్నాడని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్థానిక ఎమ్మార్వో చాట్ల వెంకటేశ్వరరావును పిలిపించి రైతుల దారి విషయంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల వెంకట సీతమ్మ, వైకుంఠరావు, ఎంపీటీసీ సభ్యురాలు మారిపోగు అనూష, మహేష్‌బాబు, ఎఎంసి చైర్మన్ నాగి నర్సిరెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎ.కొండూరు అడ్డరోడ్ సమీపాన ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మత్రియ తండ సర్పంచ్ భూక్య ఝాన్సీ, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు, సోలా నరసింహారావు, జడ్పిటిసి భూక్య గనియ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కళ్యాణి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జ్యోతి పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని దబ్బాకుపల్లి గ్రామంలో మంగళవారం కొమరగిరి ఛారిటబుల్ సొసైటీ, చినఆవుటపల్లి

పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దబ్బాకుపల్లి, పరిసర గ్రామాల నుండి దాదాపు 80 మంది వరకు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. నలుగురికి కంటి ఆపరేషన్‌కి రిఫర్ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొట్టే నాగేశ్వరరావు, కొమరగిరి చారిటబుల్ సొసైటీ నిర్వాహకులు కొమరగిరి భరద్వాజ్, శ్రీసాయి సెంచరీ స్కూల్ ప్రిన్సిపాల్ కొమరగిరి సవిత, పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల డాక్టర్ పూజిత, మానస, రాఘవ, గ్రామ నాయకులు షేక్ జానీ పాల్గొన్నారు.

'డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి'

ప్రజాశక్తి-వత్సవాయి: అర్హులైన డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతికుమార్

డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మక్క పేట గ్రామంలో డప్పు కళాకారుల జిల్లా కమిటీ సమావేశం వేల్పుల అజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ డప్పు కళాకారులు, చర్మకారులు అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న గజ్జెలు, డ్రస్సులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో డప్పు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

రూ.89 కోట్లతో తాగునీటి సరఫరాకు చర్యలు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నగర పంచాయతీ పరిధిలో రూ.89 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు చెప్పారు. నందిగామ నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం యూనిసెఫ్ అధికారులతో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ప్రజాప్రతినిధులకు, మునిసిపల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.జయరాం మాట్లాడుతూ నీటిని వృధా చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ మాడుగుల నాగరత్నం, సార్డ్స్ సంస్థ అర్బన్ వాష్ ప్రాజెక్ట్ స్టేట్ కోఆర్డినేటర్ బి.వి.రావు, ఆర్‌హెడ్స్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ వర్క్‌షాపు వద్ద ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-భవానీపురం: ఏపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం విద్యాధరపురం ఆర్టీసీ జోనల్ వర్కుషాపు వద్ద ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేటు మీటింగ్ నిర్వహించి, కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాన్ ఆపరేషన్ సెక్రటరీ వి.శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మిక, ఉద్యోగులకు అన్నిరకాల వేతనాలు, బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి, నేడు అన్ని రకాలను పెండింగ్‌లో పెట్టారని వాపోయారు. గత మూడునెలలుగా ఆర్టీసి ఉద్యోగులకు పెండింగు పెట్టిన ఓటిలు, ఇతర అలవెన్సులు వెంటనే చెల్లించాలన్నారు. సిక్ లీవ్ పెట్టిన వారికి మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, పెండింగు పెట్టిన జీతాలు చెల్లించాలని, కొత్త పిఆర్‌సి నిబంధనల మేరకు అన్ని కేటగిరుల సిబ్బందికి ఆటోమెటిక్ అడ్వాన్స్ స్కీమ్ చెల్లించాలని అన్నారు. విలీనం అనంతరం ఉద్యోగోన్నతులు, గ్రేడ్ వన్స్ ప్రమోషన్లు ఇచ్చిన 2096 మందికి ఉద్యోగులకు వెంటనే 11వ పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ మరియు నాన్-ఆఫరేషన్ విభాగాలలో పనిచేస్తున్న సిబ్బందికి చెల్లించాల్సిన నెల నెలా ఇన్సెంటివ్‌లను బకాయిలతో పాటు చెల్లించి, ఏ నెలకు ఆ నెల ఇన్సెంటివ్ చెల్లించేలా చూడాలన్నారు. పిటిడి

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

ఉద్యోగులకు 2020-21, 22 సంవత్సరాలకు పెండింగ్‌లో వున్న లీవ్ ఎన్ క్యాష్ మేంట్‌ను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ స్పోర్ట్స్ నాయకులు కోటేశ్వరరావు, ప్రసాద్, సురేష్, ఇబ్రహీం, కరీముల్లా, ఇ.యు నాయకులు, ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల ధర్నా

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రెండు సంవత్సరాల నుంచి ఎండిఒ కార్యాలయాల్లో ఉంచిన గజ్జెలు, డ్రస్సులు ఇవ్వాలని కోరుతూ చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయం వద్ద డప్పు కళాకారులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు డప్పులు, గజ్జెలు, డ్రస్సులు పంపిణీ చేయాలని ఆందోళనలు చేపట్టినా ఎమ్మెల్యే అనుమంతి ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారని అన్నారు. ఇతర మండలాల్లోని కళకారులకు డప్పులు, గజ్జెలు, డ్రస్సులు పంపిణీ చేసినా జగ్గయ్యపేటలో పంపిణీ చేయకపోవడం దారుణమనానరు. డప్పు కళకారులను చులకనగా చూడటం వల్లే పంపిణీ చేయడంలేదన్నారు. డప్పుల కళకారులకు ప్రమాద బీమా రూ.5 లక్షల పొందే ఏర్పాటు చేయాలని, మృతిచెందిన డప్పు కళాకారులకు వైఎస్ఆర్ భీమా వర్తింపజేయాలని, వెంటనే

డప్పు కళాకారులకు డప్పుల, గజ్జెలు, డ్రస్సులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల గౌరవ అధ్యక్షులు జుజ్జువరపు వెంకటరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమళ్ల అబ్రహాం, పెద్దపొంగు సిల్వారాజు, మల్కాపురం గ్రామసర్పంచ్ అంభోజి విద్యాసాగర్, మార్కపూడి రవి, ఎన్ ఫ్రాన్సెస్, ఎ.సుధాకర్, కె.చిట్టిబాబు, ఆదిమళ్ల నాగేశ్వరావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గణిత పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వాగ్దేవి జూనియర్ కళాశాల దశమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఎస్ఎస్‌సి విద్యార్థులకు బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గణిత ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.సురేష్ వివరించారు. ఈ పోటీ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థులకు దాదాపు 10 వేల రూపాయల నగదు బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. గణితం పట్ల ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని కరస్పాండెంట్ బి.సరిత తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాలలో రోడ్లపై తిరుగుతూ బిక్షాటన చేస్తున్న యాచకులను గుర్తించి వారికి నూతన వస్త్రాలు అందజేసిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ మోగులూరి ఎలీషా, సెక్రటరీ సుమలత, ఆర్టీసీ నాయకులు అబ్రహం, దైవజనులు రాజేంద్రప్రసాద్, యోహాను, అనిల్, ప్రభుదాసు, రవి పాల్గొన్నారు.

23న కెఎల్ వర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కెఎల్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ తెలిపారు. స్నాతకోత్సవం ఏర్పాట్లపై నగరంలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవంలో శాస్త్ర సాంకేతిక విభాగం కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోపన్యాసం చేస్తారని చెప్పారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ గురువు రవిశంకర్, డెలాయిట్ కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కామేష్ ముళ్లపూడి, చలనచిత్ర పరిశ్రమ సంగీత దర్శకులు కోటి అతిథులుగా పాల్గొని మాట్లాడతారని చెప్పారు. 2021-22 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వివిధ కోర్సుల్లో పిహెచ్‌డి పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులతో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు, వెండి, కాంస్య పతకాలను అందించనున్నట్లు చెప్పారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. స్నాతకోత్సవం ఉదయం పది గంటలకు ప్రారంభం అవుతుందని, మొత్తం 3,694 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ కిషోర్ బాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని చిల్లకల్లు బీసీ కాలనీ సమీపంలో మంగళవారం కబడ్డీ పోటీలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, మండవ శ్రీనివాస్ గౌడ్, దొంగల జానకి రామయ్య, సైదేశ్వర రావు, రూపన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, కౌన్సిలర్లు సాదుపాటి రాజు, వట్టేం మనోహర్, దువ్వల రామకృష్ణ పాల్గొన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ సచివాలయ పరిధిలో పని చేస్తున్న పది మంది పారిశుధ్య కార్మికులకు సిఎం జన్మదినం సందర్భంగా నూతన వస్త్రాలను డాక్టర్ బొజ్జా సౌమ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు హ్యాపీ బర్త్ డే అని ఇంగ్లీష్ అక్షరాకృతిలో కూర్చొని సిఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వీరులపాడు: మండల పరిధిలోని జుజ్జూరు గ్రామ సొసైటీ ఆవరణలో కేడీసీసీబీ నిధులు రూ.25.30 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణ పనులకు, స్ట్రాంగ్ రూమ్, గోడౌన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, కేడీసీసీబీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పెద్దాపురం బ్రాంచ్ ఆవరణలో రూ.8 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోటేరు లక్ష్మి ముత్తారెడ్డి, జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సొసైటీ అధ్యక్షులు పూల రాంబాబు, సర్పంచ్ రమావత్ కోటి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల ఘటనలో నిందితులను శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పల్నాడు జిల్లా మాచర్లలో వైసీపీ ప్రభుత్వం, పోలీసులు కలసి బ్రహ్మానంద రెడ్డిని హత్యచేయలనే కుట్ర చేసారని స్పష్టమవుతుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర,మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణ రావు లు పేర్కొన్నారు. మాచర్ల ఘటనపై పోలీసులు నిష్పక్ష పాతంగా వ్యవహరించి నిందితులను కటినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయం లో పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులు ప్రభుత్వంతో కలసి ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఇంక ప్రజాస్వామ్య నికి అర్థం ఏముందన్నారు. ప్రజాస్వామ్యం సిగ్గుపడే ఈ ఘటన పై ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ళ బుల్లయ్య ,మోటపర్తి బాబా ప్రసాద్, బత్తిన దాస్, గోపు సత్యనారాయణ మాచవరపు ఆది నారాయణరావు, కుంచె నాని, మరకని పరబ్రహ్మం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ఘనంగా రావి జన్మదిన వేడుకలు

రావి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ

మాజీ ఎమ్మెల్యే, టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు జన్మదినోత్స వేడుకలు టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణ, మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ బుల్లియ్యలు పాల్గొని జన్మదినోత్సవం కేక్‌ను కట్ చేసి రావికి శుంభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-విజయవాడ : నిరుపేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భరోసా కల్పిస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కాలికి బలమైన గాయమై చికిత్స పొందుతున్న గాంధీనగర్ సాంబమూర్తి రోడ్డుకి చెందిన డొకర పైడమ్మ అనే మహిళకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 22 వేల చెక్కును కుటుంబసభ్యులకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు ఈ సందర్భంగా మల్లాది విష్ణు వెల్లడించారు. అత్యవసర సమయాల్లో పేదలు ఆధునిక వైద్యసేవలు పొందేందుకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న కుటుంబాలు ఆపద వస్తే అధైర్యపడొద్దని సూచించారు. ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- తోట్లవల్లూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాయి ప్రసన్న ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,ఆశా వర్కర్లు, నర్సులు, డాక్టర్లు ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. సెమీ క్రిస్మస్ కేకును కట్ చేసి ఒకరికొకరు క్రీస్తు పుట్టుక గురించిన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాస్టర్ ఐజయ్య, డాక్టర్ మాధవి ఎంపీహెచ్ఈఓ మాణిక్యం పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులను మంగళవారం మండలంలోని కౌతరం, పద్మాలయం, మామిడి కోళ్ల గ్రామంలో పంపిణీ చేశారు. గత పది రోజులుగా మండలంలోని 20 గ్రామాలలోని సుమారు 80 చర్చిలకు చెందిన ఐదు వేల మంది క్రైస్తవులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసినట్లు ప్రతినిధులు గొర్రె ముచ్చు వెంకట నరసింహారావు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి నిర్భంద ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. రంగారావు నిర్భంద ఉద్యోగ విరమణకు ఆదేశిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. అవనిగడ్డ గ్రామ పంచాయతీర్శిగా పనిచేసిన సమయంలో జనన న మోదు రిజిష్టరు తారుమారుచేసి కొందరికి జనన ధవీకరణ పత్రాలు అప్పటి శానిటరీ ఇన్స్పెక్టర్ కె. సుధాకర్తో కలసి జారీయగా ఈవిషయమై అక్టోబరు-2016లో జిల్లా కలెక్టర్కు, డిసెంబరు-2016న అప్పటి లోకాయుక్త జస్టిస్ బి. సుభాషణరెడ్డికి శ్రీనివాసగౌడ్ ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం జిల్లా పరిషత్ సీఈవో నివేదిక పరిశీలించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ లోకాయుక్త ఆదేశాల మేర లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రంగారావును నిర్భంద ఉద్యోగ విరమణకు ఉత్తర్వులు జారీచేసినట్టు పేర్కొన్నారు.

పంట నష్టం అంచనాలు తయారు

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి మండల పరిధిలోని కోసూరు వారి పాలెం, కల్లేపల్లి, కే కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలకు చెందిన వ్యవసాయ శాఖ సహాయ కులు ఇటీవల తుఫాను వర్షాలకు నష్టపోయిన వరి పంట నష్టాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 80 ఎకరాల విస్తీర్ణంలో వరి కోతలు కోయక ముందే వరి పంట నేలకొదిగి రైతులు వంట నష్టపోయినట్లు నమోదు చేసినట్లు మోపిదేవి మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం శ్రీనివాస్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని కే కొత్తపాలెం, పెదకళ్ళేపల్లి తదితర గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో వరి పంట పనుల మీద ఉండి వర్షాలకు తడిసిన రైతులు నష్టపోతున్నట్లు ఏవో తెలిపారు. అదేవిధంగా వరి పంట పనుల మీద ఉన్న రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తే మినిము, పసర, తదితర విత్తనాలు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యతోపాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించాలని ఉయ్యూరు మండల తహసీల్దార్ కె. మస్తాన్, పట్టణ మహిళా స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు పడమట భువనేశ్వరీదేవి అకాంక్షించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, జిల్లా నెహ్రూ యువకేంద్రం, పట్టణ మహిళాస్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్ జీఎస్ డిగ్రీకళశాలలో రెండురోజులపాటు గ్రామ, క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమం పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో విద్యాలయాల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, చదువులకే పరిమితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, 100 మీటర్ల పరుగు, షాట్ పుట్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన పురుషులు, మహిళలకు అతిథులు బహుమతులు, షీల్డులు, మెమెంటోలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ హరీశ్, నెహ్రూ యువకేం ద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటింగ్ అపిలియేటెడ్ మెంబర్ బి. వినోదక్కుమార్, కళాశాల పీడీ గోపీచంద్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బచ్చుల అర్జునుడు

బిబి గూడెంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని మండల పార్టీ,గ్రామ పార్టీ సహకారంతో బి.బి గూడెం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇంఛార్చ్ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందు రేట్లు నాలుగు రెట్లు పెంచి, అన్నీ సొంత బ్రాండ్‌లు తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. దేశంలో అందరికంటే మన దగ్గరే పెట్రోలు రేట్లు ఎక్కువ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొర్రా శ్రీనివాసరావు గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు,, క్లస్టర్ జూపల్లి సురేష్, యూనిట్ ఇంచార్జ్ సూర్యప్రకాష్ కంచర్ల, అక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జడ్‌పిటిసి చింతలపూడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి) జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జడ్పిటిసి ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, విజయవాడ పార్టీ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచులు గోరుముచ్చు ఉమా, దాసరి విజయ్ కుమార్ పాల్గొన్నారు

కేక్ కట్ చేస్తున్న జడ్‌పిటిసి లక్ష్మీనారాయణ

జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి-గన్నవరం : ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయిలో రాణిస్తూ రాష్ట్రానికి వన్నెతెస్తున్న గన్నవరం సెయింట్ జాన్స్ హై స్కూల్ విద్యార్థిని (8తరగతి)ధనాల నాగ ప్రియూష ను రాష్ట్ర హెూం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత బంగారు, కాంస్య పతకాలు మెడలో వేసి అభినందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ఉత్తమంగా రాణించేలా సెయింట్ జాన్స్ పాఠశాల యాజమాన్యం కషి చేయడానికి ప్రశంసించారు. రాష్ట్రస్థాయిలో ఫెన్సింగ్ పోటీల్లో బంగారు,కాంస్య పతకాలు సాధించి జనవరి 10 నుంచి 13 వరకు కేరళలో జరగబోయే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్న నాగ ప్రియూషను అభినందించారు.

రాజీవ్‌గాంధీ పార్కులో వేడుకలకు రుసుము

స్థాయీ సంఘంలో పలు అంశాలు ఆమోదం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్, అధికారులు

ప్రజాశక్తి-విజయవాడ: దసరా సందర్భంగా 13 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్యపనులు నిర్వహించిన కార్మికులకు చెల్లించాల్సిన నిధుల అంశంపై స్టాండింగ్ కమిటీలో సభ్యులు, అధికారులు చర్చించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలోని రెండు అంశాలు మినహా మిగిలిన అంశాలను సమావేశం ఆమోదించింది. మొత్తం వెయ్యి మంది కార్మికులకు సంబంధించిన రూ.65 లక్షల మేర ఖర్చుకు సంబంధించిన వివరాలను స్టాండింగ్ కమిటీ ముందు ఉంచాలని సమావేశం తీర్మానించింది. రాజీవ్‌గాంధీ పార్కులో పుట్టిన రోజు, పెళ్లి రోజు, టివి సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్, సినిమా షూటింగ్, స్కూల్ పిల్లలకు, యోగా, వాకింగ్ చేసేందుకు, అలాగే మీటింగ్‌లు నిర్వహించుకోవడానికి ప్రత్యేకమైన రేట్లు నిర్ణయించారు. గ్రూపు మీటింగ్స్/ జన సమీకరణకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రూ.ఐదు వేలు చెల్లించాలని రేటు నిర్ణయించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు మీటింగ్ నిర్వహించుకుంటే రూ.ఎనిమిది వేలు, రోజంతా నిర్వహించుకుంటే రూ.పది వేలు చెల్లించాల్సి ఉంటుంది. వీడియో షూటింగ్‌కు రూ.ఐదు వేలు, పుట్టిన రోజు, మ్యారేజ్ డేస్ ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సినిమా షూటింగ్‌కు ఒక గంటకు రూ.పది వేలు చెల్లించాలని నిర్ణయించారు. వాకర్స్‌కు ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు రూ.300 చెల్లించాలని స్థాయి సంఘం తీర్మానించింది. ఈ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులు వియ్యపు అమరనాద్, చింతల సాంబశివరావు, కుక్కల అనిత, బాలసాని మణెమ్మ, అధికారులు సెక్రటరీ కె వసంతలక్ష్మి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, ప్రాజెక్టు ఆఫీసర్ (యుసిడి) ఎ శకుంతల, ఎడిహెచ్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాకేష్ పబ్లిక్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాస్టర్ ఇసుకయ్య పాల్గొని క్రీస్తు జననం తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ప్రేమ, దయ జీసస్ యొక్క త్యాగాన్ని అలవర్చుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ, ప్రపంచ శాంతిని కోరేదే జీసస్ విధానమని, శాంతి, సహనం, మనిషిని ఉన్నతిగా తీర్చిదిద్దుతాయని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయిని ఎస్. రేణుకా దేవి మాట్లాడుతూ అన్ని మతాలు మంచినే చెబుతాయని, అన్ని మతాల వారిని గౌరవించడమే జీసస్ విధానమని అన్నారు. ఈ కార్యక్రమం నందు కో-ఆర్డినేటర్ రమేష్ , సురేఖ, కల్పన, రూన్నీ, కరుణ, జోజి తదితర టీచర్స్ మరియు బాలికల పాటలతో వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని డాక్టర్ యన్‌టిటిపియస్ సర్వీస్ బిల్డింగ్ నుండి మెయిన్‌గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ పొదుపు వారోత్సవాలను ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కనూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు కెవి రాజారావు, టివి భాస్కరరావు, జీఎం వాసుదేవరావు, టి సుబ్బారావు, యు శ్రీనివాసరావు, నారాయణ, వి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎల్‌బిఆర్‌సిఇలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ రెడ్ క్రాస్, సబ్ బ్రాంచ్ మైలవరం సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జి.సత్య ప్రశాంత్ నాడి పరీక్షలు నిర్వహించారు. కళాశాలలోని అధ్యాపకులకు, సిబ్బందికి, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బిఆర్‌సి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎస్.కాశిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శివహరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తోలుకోడు పంచాయతీకి అవార్డు

ప్రజాశక్తి-మైలవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంరక్షణ నిర్వహణలో భాగంగా రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఇచ్చే అవార్డుల్లో రెండో అవార్డు మండలంలోని తోలుకోడు గ్రామపంచాయతీకి లభించినట్లు గ్రామ సర్పంచి ఓబుల్ రెడ్డి దుర్గారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇంకొల్లు చంటి, గ్రామ నాయకులు బుర్రి ప్రతాప్, పాఠశాల విద్యా చైర్మన్ కర్రి సునీల్ పాల్గొన్నట్లు చెప్పారు.



సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: సీఎం జగన్ పుట్టినరోజును రాష్ట్ర వ్యాప్తంగా పండుగగా చేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవానీపురంలో గల కరకట్ట సౌత్ దుర్గ గుడి వద్ద మంగళవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ నేడు పర్యావరణం కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చెట్లు నాటుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, స్థానిక డివిజన్ కార్పొరేటర్ యరడ్ల అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 44వ డివిజన్ 139 సచివాలయం పరిధిలో మువ్వల వారి వీధిలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మైలవరపు దుర్గారావు, వెలంపల్లి సుబ్బారావు, చిట్టూరి రాఘవరావు, వల్లం రవికుమార్, గుంటుపల్లి రామదాసు, ఇనుపకుర్తి రాము పాల్గొన్నారు. 45వ డివిజన్‌లో మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-వన్‌టౌన్: జక్కంపూడి గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని శివసాయి దుర్గా అపార్ట్‌మెంట్ ఎస్ఎఫ్-3లో కొరారు లక్ష్మీ నివాసం వుంటున్నారు. విఆర్‌ఓగా పని చేస్తున్న లక్ష్మీ విధుల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విజయవాడ నుండి జక్కంపూడి గ్రామం మీదుగా గొల్లపూడి వైపు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించింది. 35-40 సంవత్సరాలు కలిగిన మగ వ్యక్తి రెండు రోజుల క్రితం చనిపోయి ఉన్నట్లు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు విచారణ చేపట్టారు.

మున్సిపల్ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సోమవారం కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌పై టిడిపి కౌన్సిలర్ దుర్భాషలాడిన సంఘటనపై కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి రక్షణ కల్పించాలని, ఉద్యోగులపై దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: క్రిస్మస్ సందర్భంగా కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్‌లో తెలుగుదేశం నాయకులు నాగోతి రామారావు ఆధ్వర్యంలో చిట్టినగర్ అద్దరోడ్‌లోని సిఎస్ఐ చర్చి వద్ద సెమీ క్రిస్మస్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డి. సామ్యూల్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేశినేని శివనాథ్, నాగుల్‌మీరా, కాండ్రేగుల రవీంద్ర చేతుల మీదుగా కేక్ కట్ చేసి క్రిస్మస్ కానుకగా 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గుర్రంకొండ, బుదాల నంద కుమారి, కామా దేవరాజ్, బెవర జోగేశ్వరరావు, పోతిరెడ్డి లోకేష్, దాసు, ఈగల సాంబ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహిని కళాశాల సందర్శన

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఒకేషనల్ విద్యార్థులు ఉద్యోగ శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక శ్రీవాహిని ఇంజినీరింగ్ కళా శాలను సందర్శించారు. తమ కోర్సులకు సంబంధించిన విభాగాల్లో విద్యార్థులు ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుల నుండి ట్రైనింగ్ తీసుకు న్నట్లు ప్రిన్సిపాల్ రెబ్బ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ ఊటుకూరి సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, ఏవో ముత్యాల కిషోర్ బాబు, అధ్యాపకులు పాల్గొ న్నారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించుకొని ముందుకు సాగినప్పుడే ఆ సమాజం అభివద్ధిని సాధించేందుకు అవకాశముంటుందని ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య కె రామమోహనరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యామండలి సౌజన్యంతో 'పెట్టుబడులపై అవగాహన' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించిన ఆచార్య కె.రామమోహనరావు మాట్లాడుతూ ఆర్థికాంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి తద్వారా పొదుపు, పెట్టుబడుల శాతం పెంపొందించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు, వారిని అవగాహన పరిచేందుకు అధ్యాపకులకు ఈ విధమైన సదస్సులను ఉన్నత విద్యామండలి రూపొందించిందన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేని వ్యక్తులు జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించలేరన్నారు. పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంపొందించుకొని తద్వారా దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ అకాడమీ ప్రతినిధి అర్చనమేఘనా మాట్లాడుతూ భారతీయుల్లో పొదుపు అంశం చాలా కాలంగా అంతర్లీనంగా ఉందన్నారు. కొవిడ్ వంటి సమయంలో యావత్ ప్రపంచం ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటే భారతదేశం మాత్రం దానిని చాలా వరకూ తట్టుకొని ముందుకు సాగిందన్నారు. దానికి కారణం ఈ దేశంలో ఉన్న పొదుపు అని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థిక క్రమశిణ, పెట్టుబడులు పెట్టడం వంటి అంశాలపై సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండల మార్పునకు వ్యతిరేకంగా దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఐదో రోజు నిరాహార దీక్ష కొనసాగించారు. వాసిరెడ్డి రాధాకృష్ణ, వట్టి కొండ చంద్రమోహన్ దీక్షను ప్రారంభించారు. మండలం మార్పును వెంటనే ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

నాటు సారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం: ఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కృష్ణాజిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ జాషువ అన్నారు. నాటు సారాను విడనాడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి నిమిత్తం అన్ని శాఖల సమన్వయంతో 43 మందికి 33 లక్షలు రుణాలను చెక్కుల రూపంలో జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ అందచేశారు. నాటుసారా తయారీ చేసే వారి కుటుంబ భవిష్యత్ కూడా ప్రశ్నార్ధకంగా మారుతుందని అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా నాటు సారాను విడనాడిన కుటుంబాలకు, ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో ఎస్పీ బృహత్కర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రుణాలు మంజూరుకు ఎంపిక కాబడిన కుటుంబాలకు జిల్లా పోలీస్ వెల్ఫేర్ ఫంక్షన్ హాల్ చెక్కులను అందజేశారు. నాటు సారా తయారీని విడిచి జీవనోపాధి కోసం ఎంపిక కాబడిన మొత్తం 43 మందికి 33 లక్షల రూపాయలు చెక్కులను, 14 మందికి జాబ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కష్ణాజిల్లాను నాటు సారా రహిత జిల్లాగా మార్చడానికి లా అండ్ ఆర్డర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఒకవైపు నాటు సారాను నిర్మూలించడానికి చట్టపరంగా కొరడా ఝులిపిస్తూనే, మరొకవైపు మార్పు తీసుకు రావాలని ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఒక వ్యక్తి సమాజంలో గుర్తింపు కలిగి జీవించాలంటే అతని ఎంచుకున్న మార్గం కూడా ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 90 శాతం నాటు సారాను ప్రజల సహకారం నియంత్రించగలిగామని అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా నిర్మూలన కోసం పోలీస్ యంత్రాంగం తరపున నిర్వహిస్తున్న ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ఎంతో

అభినంది నీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్చార్జ్ అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకట రామాంజనేయులు, డిఅర్డిఏ ప్రోజెట్ డైరెక్టర్ శివ రామప్రసాద్, బందరు డిఎస్పి మాసూం భాష, సెబ్ ఏఈఎస్ కష్ణకుమారి, జిఎం డిస్టిక్ ఇండస్ట్రీస్ అర్ వెంకట్రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 2023 ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డిఎల్ఎస్ఏ చైర్ పర్సన్, కష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి అరుణ సారిక ఒక ప్రకటనలో తెలియజేశారు. కృష్ణా జిల్లా పరిధిలో మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం, ఉయ్యూరు, మొవ్వ, బంటుమిల్లి, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడ, నందిగాము, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం, మరియు ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని తెలిపారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లయిమ్ లు మరియు అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకొనవచ్చన్నారు.

పండుగలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపో నుండి క్రిస్టమస్ సంక్రాంతి పండుగలను పురస్కరిం చుకొని అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు సౌకర్యార్థం ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాదులోని వివిధ ప్రదేశాల నుండి అవనిగడ్డకు ప్రత్యేక బస్ సర్వీసు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేకమైన బస్సులలో చార్జీలు మామూలుగానే వసూలు చేస్తామని అన్నారు. ప్రత్యేక బస్సులు బిహెచ్ఇఎల్ కెపిహెచ్ మియాపూర్ ఈసీఐఎల్ నుండి బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ నిధులు విడుదల

ప్రజాశక్తి-చల్లపల్లి

జల్‌జీవన్ మిషన్ పథకానికి కోటి రూపాయలు నిధులు మంజూరు అయినట్లు మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు తెలిపారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వి.బాలసౌరి స్థానిక శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆదేశాలు మంగళాపురం గ్రామపంచాయతీలో నిర్మాణం చేస్తున్న మైక్రో ఫిల్టర్ బెడ్స్ నిర్మాణ స్థలాన్ని మంగళవారం సర్పంచ్ నాగేశ్వరరావు అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని ఊర చెరువు, వివిధ కాలనీలో పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ, సచివాలయం సిబ్బంది పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు

విఓఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - గుడివాడ

విఓఏల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివాడ మండలంలో పారుబాకి పేరుతో వేధిస్తున్నా రన్నారు. ఈ పారు బాకీలు ఉండటానికి కారణం సీసీలు డబ్బులు తినేయటం వల్ల బాకీలు పెరిగిపోయి ఒత్తిడికి విఓఏలు గురవుతున్నారన్నారు. విషయంపై అధికారులు విచారించి విఓఏలకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విఓఎలు మాట్లాడుతూ సిసి ప్రసన్న లక్ష్మీ చేసిన అవకతవకలు విషయంపై అధికారులు ఆమెను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. అంతేకాకుండా విఓఏలు

సమావేశంలో మాట్లాడుతున్న విఓఏలు

కట్టాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని చేశారు. అధికారులు తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నందివాడ మండలం పెద్ద లింగాల వివో ఏ. గుమ్మాల శ్రావణి, జనార్ధనపురం వివో కె మేరీ జోష్మన్, వివో వీరాంజమ్మ , ఐద్వా కార్యదర్శి పి రజిని తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు వర్ల పరామర్శ

ప్రజాశక్తి-పెదపారుపూడి

మండలంలోని మహేశ్వరపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా మంగళవారం పరామర్శించారు. గ్రామ మాజీ సర్పంచ్ ,తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు తిప్పర్నపల్లి మధుసూదన్ రావు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఇటీవల చీకుర్తి జయమ్మ, చీకుర్తి విజయ రత్నం మృతి చెందిన విషయం తెలుసుకుని ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, నాయకులు సజ్జ శివకుమార్, గుండపనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాపారులకు దోచుకుంటున్న ప్రభుత్వం : కొల్లు

ప్రజాశక్తి-గుడివాడ

ప్రజలతో పాటు వ్యాపారుస్తులను వైసీపీ ప్రభుత్వం దోచుకుట్టుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రుచౌక్ నుండి మున్సిపల్ కాంప్లెక్స్ వరకు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్ అధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రనికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొనకళ్ళ బుల్లియ్యలు వ్యాపారస్తుల సమస్యలను, ప్రభుత్వం పాలన ఏమిధంగా ఉందని అడగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు

వ్యాపారస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి కొల్లు, మాజీ ఎంపి కొనకళ్ళ, రావిలు

వ్యాపారులు ప్రభుత్వంపై వేతిరేకతను వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్‌లో ఎంపికైన 18 మంది ఆరోగ్య మిత్రాలకు, ముగ్గురు టీం లీడర్లకు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి వైద్యాధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేస్తూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం నిరుపేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించుటకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. నిరుపేదలకు సరైన మార్గదర్శకం చేసి ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేసేటట్లుగా చూడాలని వారికి సూచించారు.

రంగు మారిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల : రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి మనోహ రరావు అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని అయినపూరు, లంకపల్లి, కష్ణాపురం తదితర గ్రామాల్లో పర్యటించి రంగు మారిన తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి పరిహారం వచ్చే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్, రైతులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో 'విశ్వభారతి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటివల బెంగుళూరులో నిర్వహించిన 60వ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశ్వభారతి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఆర్.కెవిన్ పాల్ స్వర్ణపతకాన్ని, జి.గాయత్రి కాంస్య పతకాన్ని కైవసం చేసుకోవడం అభినంద నీయమని పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక విశ్వభారతి పాఠశాలలో జాతీయస్థాయి పోటీలలో పతకాలను సాధించిన విద్యర్థులను అభినందించే కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యర్థులు చదువుతో పాటు ఆటలు, చదరంగం. వివిధ సాంస్కృతిక, కళలలో ప్రతిభను చాటుతునరన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మొదటి పేజీ తరువాయి

సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరు అరెస్టు

పాల్పడ్డారని తెలిపారు. మూడు రోజులపాటు సనత్‌నగర్‌లోని ఓ ఇంట్లో అత్యాచారం చేశారన్నారు. అనంతరం శీను బాధితురాలిని బాలకోటికి అప్పగించాడని తెలిపారు. అనారోగ్యంగా ఉండటంతో బాలకోటి ఆమెను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడని చెప్పారు. వైద్యుల సమాచారంతో పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నిందితులను అరెస్టు చేశామన్నారు. నిందితుల్లో ఒకడైన రవికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అలాగే కూలిపనులు చేసుకుంటూ ప్లై ఓవర్ కింద నివసించే వారి జాబితాను కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు.

అత్యాచార బాధితురాలికి వైద్య పరీక్షలు

కానూరు సనత్ నగర్‌లో సంచలనం కలిగించిన మహిళపై సామూహిక అత్యాచారం కేసులో బాధితురాలు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతోంది వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె ప్రాణానికి ప్రమాదంలేదని తెలిపారు. మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడిన కామాంధులు సున్నితమైన భాగాల్లో ఆమెను తీవ్రంగా గాయపరిచినట్లు సమాచారం. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలలోకి వెళితే....గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన మహిళకు 15 ఏళ్లక్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు కలిగిన అనంతరం భర్తతో విభేదాలు వచ్చి ఆయనతో తెగతెంపులు చేసుకుంది. ఆ తర్వాత మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆ వ్యక్తితోనూ విభేదాలు రావడంతో విజయవాడ వచ్చి కూలి పనులు చేసుకుంటోంది. అయితే ఈనెల 16న సమీపంలోని సులభ కాంప్లెక్స్‌లో పనిచేసే శ్రీనివాస్ సనత్‌నగర్లో అతని మిత్రుడు నాగరాజు ఇంటిని శుభ్రం చేయాలని నమ్మించి తీసుకెళ్లాడు. అందుకు రూ.500 ఇస్తామని చెప్పాడు. ఇంటికి తీసుకెళ్లిన తర్వాత ఆమెతో మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న ఆమెపై శ్రీనివాస్, నాగరాజుతోపాటు మరో వ్యక్తి రవి ఒకరి తర్వాత మరొకరు రెండు రోజులపాటు ఆమెపై సామూహిక అత్యాచారం జరిపారు. వైద్యులు ఆమె పరిస్థితి పరిశీలించి పెనమలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

బెంజిసర్కిల్ బిల్డింగ్ అడ్డాలో పని నిమిత్తం ఉన్న మహిళను పని ఇప్పిస్తానని తీసుకుని వెళ్లి బలాత్కారం చేయడమే కాకుండా మరో ఇద్దరితో బలాత్కారం చేసి మహిళను గాయపరచడం దుర్మార్గమని అన్నారు. రోజు రోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రధానంగా పెరుగుతున్న మద్యం, మాదక ద్రవ్యాలే కారణమన్నారు. మహిళలపై దాడి చేస్తున్న వ్యక్తులపై నిఘా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నగరాలు, జన రద్దీతో ఉండే ప్రాంతాల్లో పోలీసు నిఘా వ్యవస్థ పెంచి మహిళలకు భద్రత కల్పించాలన్నారు. ఈఘటనపై సమగ్రంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈఘటనలో బాధితురాలి ఆరోగ్యం క్షీణించిందని, ఆమెకు మెరుగైన వైద్యంచేయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆషా, షకీలా, సిఐటియు తూర్పు నగర కార్యదర్శి ఎన్.కోటి తదితరులు పాల్గొన్నారు.

24/7 అందుబాట్లో

సేవిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు బార్లకు అనుమతించారు. కానీ మండలంలో కొన్ని బార్లకు 'ప్రత్యేక' అనుమతులుండటం గమనార్హం. దీంతో 24 గంటలూ విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులకు మామూళ్ళు ముట్టడమే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని బార్ల వద్ద గంజాయి విక్రయాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. యనమలకుదురు వందడుగుల రోడ్లోని ఓ బార్ షాపు వద్ద గంజాయి సేవించే వారు అధికంగా సంచరిస్తున్నట్లు చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. ఆ బార్ క్యాషియర్ కరోనా లాక్‌డౌన్ సమయంలో తెలంగాణా మద్యం విక్రయిస్తుండటంతో అప్పటి సిఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు దాడులు చేశారు. తెలంగాణా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అప్పట్లో తెలంగాణా మద్యం విక్రయించిన వారందరిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం, రౌడీషీట్లు తెరవడం వంటివి చేసిన పోలీసులు ఆ క్యాషియర్‌పై ఎలాంటి షీట్ తెరవకపోవడం గమనార్హం. ఓ మాజీ మంత్రి సిండికేట్‌కు చెందిన బార్ కావడంతోనే దీనివైపు పోలీసులు కన్నెత్తి చూడంలేదని వినికిడి.

జిల్లా ఆర్థిక ప్రగతికి తోడ్పడండి

మేర రబీలో రుణాలు అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఎస్‌ఎంఇ సెక్టార్‌కు సంబంధించి రూ.4,770 కోట్లు లక్ష్యం కాగా, రూ.4,135 కోట్ల రుణాలు అందజేసి 86.69 శాతం ప్రగతి సాధించామన్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి రూ.2,108 కోట్ల రుణ లక్ష్యంకాగా, రూ.1,365 కోట్ల రుణాలు అందజేసి 64.75 శాతం ప్రగతి సాధించామన్నారు. ఈసమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలు ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రుణాలు అందించి జిల్లా ప్రగతికి సహకరిస్తున్న బ్యాంకర్లను అభినందిస్తున్నామన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందుకు సంబంధించి అన్ని బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు తక్షణమే రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. కౌలు రైతులకు విరివిగా రుణాలు అందించాలని, జిల్లాలో క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్, జాయింట్ లైబిలిటీ గ్రూప్, రైతు మిత్ర గ్రూప్‌లకు సంబంధించి 7,870 మంది కౌలుదారులకు రూ.120 కోట్ల రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,443 మందికి రూ.32.84 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణం అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. అగ్రి క్లినిక్ ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహితులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని కోరారు. జిల్లాలో మ్యాంగో పల్ప్, మ్యాంగోఫ్రూట్స్, చిల్లీ పౌడర్ ఎగుమతులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా ఎగుమతి యూనిట్లకు బ్యాంకులు రుణాలు అందించాలని అన్నారు. పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేసే ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం టిడ్కోలో స్వయం సహాయక సంఘం గ్రూపులోని సభ్యులకు రూ.35 వేల వరకు రుణాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎంఎల్ఏ మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి కమిషరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు అమలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో యు/ఎస్ 144 (2) సిఆర్‌పిసి కింద నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మెజిస్ట్రేట్ కాంతి రాణా టాటా ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు, అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈనెల 22 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను పరిష్కరించాలి : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - విజయవాడ : ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిందని, కానీ ఆచరణలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్‌బికే నిర్ధారించిన తేమ శాతాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని, అవసరమైన గోనె సంచులు రైతులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎంఆర్ఆర్ విద్యార్థులను పరీక్షలకు అనుమతించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బిఇడి నాలుగో సెమిస్టర్ పరీక్షలకు నందిగామలోని ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థులను అనుమతించాలని కోరుతూ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఒకటి, రెండు, మూడు, సెమిస్టర్ ఫలితాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలిపారు. ఆ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కృష్ణ యూనివర్సిటీ అధికారులు హామీ ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం నగరంలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో పిడిఎఫ్ ఎంఎల్సి కె.ఎస్ లక్ష్మణరావును నందిగామ ఎంఆర్ఆర్ బిఇడి కళాశాల విద్యార్థులు కలిసి తమ సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన కృష్ణ యూనివర్సిటీ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు , ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి చిన్న సమస్యకూ అనవసర ఆందోళన : కొల్లి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భద్రతవరంగా పూర్వికుల కన్నా మనం ఎన్నో రెట్లు మెరుగైనప్పటికీ జీవితంలో ఎదురయ్యే ప్రతి చిన్నసమస్యకీ అనవసర ఆందోళన చెందుతున్నామని అమెరికాలో స్థిరపడిన ప్రముఖ ప్రవాసాంధ్ర వైద్యులు, అంతర్జాతీయ మానసిక వైద్య నిపుణులు, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏఏపిఐ) అధ్యక్షులు డాక్టర్ కొల్లి రవీంద్రనాథ్ అన్నారు. విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం డాక్టర్ కొల్లి రవీంద్రనాథ్‌ను ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ పక్షాన అధ్యక్ష కార్యదర్శులు కోనేరు వెంకట రామారావు, కుర్ర సాయిరామ్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ కొల్లి మాట్లాడుతూ సమస్యలను అవకాశాలుగా చూడటం అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత పెరుగుతుందన్నారు. అసోసియేషన్ తరపున అధ్యక్ష కార్యదర్శులు తమ్మల లక్ష్మణస్వామి, గోపిశెట్టి వీరవెంకయ్య, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ అధ్యక్ష కార్యదర్శులు కోనేరు వెంకట రమేష్, కోనేరు జగదీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కార్యదర్శి దాసరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి నాదెళ్ల కృష్ణ, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి కూడా ఘనంగా సత్కరించారు.

CHANGE OF NAME

I, **VEERANKI BHANU SIREESHA (Old Name),** Resident of 75-11-241, Alludupeta, Bhavanipuram, Vijayawada(Urban),Krishna Nagar, Vijayawada, Krishna Dist-520012. My Name has been changed to **KOMARA BHANU SIRISHA (New Name)** Hereafter my name is known as **KOMARA BHANU SIRISHA.**

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, అవనిగడ్డ నియోజకవర్గం, కోడూరు మండలం పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన మేరుగు కోటయ్య గారి కుమారుడు బాబూరావు అను నేను డిసెంబర్ 7 వ తేదీ జిరాక్స్ కాపీలు అవసరమని ఇంటి నుంచి కోడూరు జిరాక్స్ షాప్ కు వెళ్లగా మార్గమధ్యంలో కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామ రెవెన్యూ లోని R.s.no.292/2A3 య.3.61ట్లులో య.1.00ట్లు మాగాణి భూమికి చెందిన 1817/2008 నంబరు గల ఒరిజినల్ దస్తావేజులు పోయాయి. ఎవరికైనా దొరికితే స్థానిక పోలీస్ స్టేషన్లో కానీ లేదా ఈ నెంబర్ కు ఫోన్ చేసి కానీ 9701564019 సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు,
మేరుగు బాబూరావు
విశ్వనాథపల్లి గ్రామం,
కోడూరు మండలం.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.300/2006

వాది :- కొప్పర్తి వీర వెంకట సత్యనారాయణ
ప్రతివాదులు:- అడబాల భవాని వగైరా
4వ ప్రతివాది :- అడబాల సత్యవాణి
W/o. చవాకులు బాలాజీ
స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో, C.I.,
పడమట, విజయవాడ N.T.R జిల్లా, AP.

పై నెంబర్ దావాలో వాది, 4వ ప్రతివాదికి దావా సమన్లు కోర్టు ద్వారాను, పోస్ట్ ద్వారాను జారీ చేయించినప్పటికీ సదరు దావా సమన్లు తీసుకోకుండా 4వ ప్రతివాది అయిన మీరు తప్పించుకొనుచున్నారు. పై నెంబర్ దావాలో 4వ ప్రతివాది హాజరు నిమిత్తం. ది 30-12-2022 సం॥రం తేది వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన 4వ ప్రతివాది అయిన మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం 10-30 లకి హాజరై మీ అక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల పై నెంబర్ దావాను 4వ ప్రతివాది అయిన మీ పరోక్షమందు తీర్మానించబడును.

K.V.సూర్యనారాయణ
J.V. V. Rama Krishna
వాది తరుపు అడ్వకేట్స్ భీమవరం.
CellNo. 9849404488

మహారాజశ్రీ నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 81/2021

బిట్వీన్ :
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ,
నందిగామ బ్రాంచి తరపున చీఫ్ మేనేజర్ ...వాది
భవాని స్వయం సహాయక సంఘం, నందిగామ
మరియు 10 మంది ...ప్రతివాదులు
1వ ప్రతివాది: భవాని స్వయం సహాయక సంఘం, నందిగామ తరపున లీడర్లు 1.షేక్ రిజ్వానాబేగం, భర్త మోహిద్దీన్, 35సం॥, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
2వ ప్రతివాది: షేక్ రిజ్వానాబేగం, భర్త మోహిద్దీన్, 35 సం॥లు, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
3వ ప్రతి వాది: షేక్ బాజీబీబీ, భర్త చిన సైదా, 33సం॥లు, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
5వ ప్రతివాది: మెండెం సీతమ్మ, భర్త సూరి బాబు, 48సం॥,నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
6వ ప్రతివాది : ఉమ్మనేని మాధవి, భర్త కృష్ణ కిషోర్, 37సం॥, డోర్ నెం.11-36/1, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
7వ ప్రతివాది : నంద్రు విజయభారతి, భర్త జేమ్స్, 52సం॥,డోర్ నెం.12-92, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
8వ ప్రతివాది: నంద్రు ప్రేమ బాయి, తండ్రి ప్రేమ్ కుమార్, 26 సం॥, డోర్ నెం.12-91/1, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
9వ ప్రతివాది: జమ్ముల రమాదేవి , భర్త సీతారామయ్య, 35సం॥, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
10వ ప్రతివాది: షేక్ జాజి మున్నిషా, భర్త షఫీ, 54సం॥, నేతాజీ నగర్, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
11వ ప్రతివాది: షేక్ బషీరూన్, భర్త రషీద్, 45 సం॥, డోర్ నెం.13-5, చందమామ పేట, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టిఆర్ జిల్లా.
...ప్రతివాదులు

పై నెంబరు దావాలోని మొదటి ప్రతివాది సంఘం మరియు సంఘ సభ్యులు 10 మంది వాది బ్యాంకు నుండి స్వయం సహాయక రుణము పొంది తిరిగి తీర్చుటలో విఫలమైనందున ,సదరు మొత్తమును వడ్డీతో సహా తిరిగి రాబట్టుకొనుటకు వాది బ్యాంకు వారు పై నెంబరు దావా దాఖలు చేయగా, పై ప్రతివాదులు హాజరు నిమిత్తం ది.28-12-2022 తేదీకి వాయిదా కలదు. కనుక పై ప్రతివాదులకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల పై తెలిపిన తేదీన ఉదయం గం.10.30.ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని,న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల పరోక్ష మందు తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతితో//

కె.వి.సుబ్బారావు,
వాది తరపు న్యాయవాది,
నందిగామ, ఎన్టిఆర్ జిల్లా.

పబ్లిక్ నోటీసు

1.ఎన్.టి.ఆర్.జిల్లా జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట పట్టణం, డోరు నెం.2-208, రామాలయం స్ట్రీట్ కాపురస్తులు (లేటు) చక్కా నాగభూషణం గారి కుమారుడు 1.**చక్కా ఉపేంద్రరావు,** 2.రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్, డోరు నెం.1-1-258, బాలాజీ నగర్ కాలనీ, రోడ్డు నెం.7/10, మోహన్ నగర్, కొత్తపేట, నివాసస్తురాలు (లేటు) చక్కా వెంకట సీతారామ మురళీ కృష్ణ కుమార గుప్త గారి భార్య **చక్కా శైలజ,** 3.ఎన్.టి.ఆర్.జిల్లా జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట పట్టణం, డోరు నెం.2-208, అమ్మాజీ కాలేజి ఎదురుగా నివాసం (లేటు) చక్కా నాగభూషణం గారి కుమారుడు **3.చక్కా అమరనాథ్,** గార్ల నుండి సంజాయిషీని పొంది యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా:-

1,3 వారలకు తల్లి గారున్నూ, మరియు 2 వ వారికి అత్తగారు అయిన (లేటు) చక్కా పద్మావతి గారు వారి జీవిత కాలంలో ది.6-10-2021 వ తేదీన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి ఒక వీలునామాను వ్రాయించి జగ్గయ్యపేట స.రి. వారి ఆఫీసులో దస్తావేజు నెం.69/2021 గా రిజిష్టరు చేయించి ఉన్నారు. దరిమిలా ది.22-8-2022 తేదీన సదరు చక్కా పద్మావతి గారు మరణించినారు. వారి మరణం దరిమిలా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి సదరు వీలునామా రీత్యా నా క్లయింట్లు స్వాధీనం పొంది సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్తికి వారల పేరుతో రెవిన్యూ రికార్డులలో పట్టాదారులుగా నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకము మరియు టైటిల్‌డీడ్ పుస్తకము మంజూరు చేయుట నిమిత్తం జగ్గయ్యపేట తహశీల్దారు గారి ఆఫీసులో అర్జీని దాఖలు చేసుకొని ఉన్నారు. ఇందు విషయమై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ రోజు నుండి ఏడు రోజుల లోపు తెలియజేయగలరు.

ఐటెం నెం.1:- కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట సబ్ డి॥ జగ్గయ్యపేట మండలం రావికంపాడు గ్రామ పంచాయితీ లిమిట్సులో చేరిన రావికంపాడు గ్రామములోని గ్రామములో **ఆర్.యస్.నెం.105/2**రు దాఖలా **య.1.65** సెంట్లు భూమికి హద్దులు, తూర్పు-చక్కా పద్మావతి గారి భూమి మరియు ఎన్.ఎస్.పి. కాలువ
దక్షిణం-చక్కా వెంకట కృష్ణ ప్రసాద్ గారి భూమి
పడమర-మోరె పెద్ద వీరభద్రం గారి భూమి
ఉత్తరం-కంకరకుంట్ల సత్యనారాయణరెడ్డి గారి భూమి
ఐటెం నెం.2:- కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట సబ్ డి॥ జగ్గయ్యపేట మండలం రావికంపాడు గ్రామ పంచాయితీ లిమిట్సులో చేరిన రావికంపాడు గ్రామములోని గ్రామములో **ఆర్.యస్.నెం.106/3** రు దాఖలా **య.8.26** సెంట్లు మింజుమలె **య.4.67** సెంట్లు భూమికి హద్దులు,
తూర్పు-మెరక భూమి మరియు గుట్టలు
దక్షిణం-మామిడి వెంకట్రావు మనుమడి భూమి
పడమర-చక్కా పద్మావతి గారి భూమి అండ్ ఎన్.ఎస్.పి. కాలువ
ఉత్తరం-చక్కా భ్రమరాంబ గారి భూమి
జగ్గయ్యపేట,
తేది.19-12-2022.

ఆకుల స్వాతి కుమార్,
బి.కాం, ఎల్ఎల్.బి.,
అడ్వకేట్-నోటరీ,
డోరు నెం.2-158, చెరువుబజారు,
జగ్గయ్యపేట-521175,
సెల్ నెం.9848440134.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి : మంత్రి

ప్రజాశక్తి-పెడన : ఆంధ్రప్రదేశ్‌ని హరితాంధ్ర ప్రదేశ్‌గా మార్చేందుకు ప్రజలందరూ నడుం కట్టాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాలనే ఆలోచనలతో ప్రతిఒక్కరూ కర్తవ్యంగా తీసుకొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పెడన పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళశారం పట్టణ వ్యాప్తంగా 500 మొక్కలు నాటే కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యం నియంత్రించడం సాధ్యమవు తుందని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బళ్ళ జ్యోత్స్నా రాణి, వైస్ చైర్మన్ మహమ్మద్ కాజా, కౌన్సిలర్లు కొసనం కరుణ కుమారి, ఉమ్మటి తనూజ, రాహేతున్నిసా, పిచ్చుక సతీష్, బళ్ళ గంగయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుకుందాం

జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ అన్నారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 1020 నీడనిచ్చే మొక్కలు నాటారు. మచిలీపట్నంలోని హిందూకాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న రాజశేఖర్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించే మాధ్యతను తీసుకోవాలన్నారు. అడవులు తగ్గిపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయ విసి కె. బి.చంద్రశేఖర్ మాజీ ఎంపి, హిందూ అనుబంధ కళాశాల అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీ పట్నం మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. అరిసేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని బైరాగిపాలెంలో నూతన స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి పేర్ని కిట్టు శంకస్థాపన చేసారు. స్కూల్ బిల్డింగ్ కు 13 లక్షలు,మరియు కాంపౌండ్ వాల్ నిమిత్తం 12 లక్షలు మొత్తం 25 లక్షలు కేటాయించిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఇంచార్జ్ చండిక అజయ్ కుమార్, ఇంచార్జి ఎంపీడీఓ బాలకష్ణ,మరియు గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది ,విద్యకమిటి సభ్యులు అధికారులు పాల్గొన్నారు. ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా.మోహన్ నాంచారయ్య, బెజవాడ.జేజిబాబు, లుక్కా.వెంకట దాసు తాతా దుర్గాప్రసాద్, మట్టారవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గూడూరు :** ఆంధ్రప్రదేశ్ ని హరితాంధ్ర ప్రదేశ్‌గా మార్చేందుకు ప్రజలందరూ నడుం కట్టాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాలనే ఆలోచనలతో ప్రతిఒక్కరూ కర్తవ్యంగా తీసుకొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గూడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగొరిపర్తి రవి కుమార్ అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గూడూరు మండలంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో జడ్పిటిసి మెంబర్ వేముల సురేష్ రంగ బాబు,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మరియు గూడూరు మండలం పి ఏ సీ ఎస్ చైర్మన్ తలుపుల వెంకట కష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ , మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, మరియు సచివాలయం సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళ వారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద అవనిగడ్డలో వద్ధులకు వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, అభివద్ధి సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకుపోతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ, కోడూరు జడ్పిటిసి లు చింతలపూడి లక్ష్మీనారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని చంద్రాల గ్రామంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపీ కొడాలి సురేష్ తాసిల్దార్ రెహమాన్ సుల్తానా, పిఎసిఎస్ అధ్యక్షులు శేషు బాబు, గ్రామ సర్పంచ్ కె అర్జున్ రావు, ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఎంపిపి వెలివిలు చినబాబు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిశెట్టి రాజిబాబు. మండల వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారి బాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు బాబురావు మల్లేశ్వరం ఎంపిటిసి పేటేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడతున్న విజయానంద్

జగనన్న కాలనీల్లో ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తి చేయాలి

- విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

ప్రజాశక్తి-విజయవాడ : జగనన్న హౌసింగ్ కాలనీస్‌లో ఎలక్ట్రిఫి కేషన్ వర్క్సను త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు సర్వీసులు త్వరిత గతిన ఇవ్వాలని విద్యుత్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విజయవాడ సర్కిల్ ఆఫీసు సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ఆపరేషన్ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె పద్మజనార్ధన్‌రెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న హౌసింగ్ కాలనీస్‌లో ఎలక్ట్రిఫికేషన్ వర్క్సను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ , డిబిటి స్కీమ్‌లో మిగిలిన రైతుల నుంచి ఈ నెల ఆఖరు లోపు బ్యాంక్ అకౌంట్ల నెంబర్లను సేకరించాలని ఆదేశించారు. వంద శాతం రెవెన్యూ కలెక్షన్స్ చేయాలని, ప్రయివేటు సర్వీసులతో పాటు గవర్నమెంట్/ పంచాయతీ సర్వీసులనుంచి కూడా బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 132/33 కెవి సబ్‌స్టేషన్లను, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను సామార్థ్యాన్ని పెంచడం లాంటి పనులను వెంటనేపూర్తి చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశంచారు. ఈ సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ బి జయభారతరావు, డైరెక్టర్ ఫైనాన్స్ వి శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్స్, ఎపి ట్రాన్స్‌కో అధికారులు, సూపరింటిండింగ్ ఇంజినీర్ ఎం శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఎంపి బాలశౌరి బ్యానర్ చింపివేత

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక ఎంపీ కార్యాలయం వద్ద శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన బాలశౌరి బ్యానరును గుర్తు తెలియని వ్యక్తులు చింపేసారంటూ ఎంపి అనుచరులు నిరసనకు దిగారు. బాలశౌరి అనుచరుడు లోకల్ శ్రీను బాలశౌరికి క్రిస్మెస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ బ్యానర్‌ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం చినిగి ఉన్న బ్యానర్ని గుర్తించిన అనుచరులు తక్షణమే ఈ చర్యకు పాల్పడిన వ్యక్తులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. బ్యానర్ చింపినది ప్రతిపక్షమా లేక స్వపక్షమా అన్న అనుమానాలు సర్వత్రతా వ్యక్తమయ్యాయి. బ్యానర్ వివాదంపై విచారణ చేపట్టిన చిలకలపూడి సీఐ రాజశేఖర్ దీంతో సంబంధమున్న లంకే రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రమేష్ వైసిపికు చెందిన ముఖ్య నాయకుడి అనుచరుడిగా తెలుస్తుంది.

పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం హిందూ కళాశాలలో జరుగుతున్న బి.ఇ.డి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కే. బి. చంద్ర శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

పోటీలు ప్రారంభిస్తున్న తంగిరాల సౌమ్య

గొర్రె పొట్టేళ్ల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ : ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలో గొర్రె పొటేళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలను మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఈ పోటీలకు మంచి స్పందన లభించింది. పోటీలను తిలకించటానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ టిడిపి ఆధ్వర్యంలో సాంప్రదాయంగా ఎడ్ల పందాలు, గొర్రె పొటేళ్ల పోటీలు నిర్వహిస్తుంటే వైసిపి నాయ కులు అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. టిడిపి నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి, దాసరి ప్రభు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

కొత్త అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : శ్రీరామ్ బ్రదర్స్ వితరంతో ఏర్పాటు చేసిన కొత్త అంబులెన్స్ ను ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ వివిధ కారణాల చేత వైద్యం నిమిత్తం విజయవాడకు సుదూర ప్రాంతాలకు వెళ్లవలసిన వారికి శ్రీరామ్ బ్రదర్స్ అంబులెన్స్ అందుబాటులోకి తీసుకురావటం హర్షించదగ్గ విషయమని అన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడాలి : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాండూస్ తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేంత వరకు తెలుగుదేశం పార్టీ తరఫున పోరాటం జరపాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నేతలు పాల్గొని ఆయా మండలాల్లో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి సమన్వయ కమిటీ దష్టికి తీసుకువచ్చారు. తుఫాను కారణంగా కురిసిన వర్షాలతో నాగాయలంక కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ, ఘంటసాల మండలాల్లో వేలాది ఎకరాలలో పంట నష్టం జరిగిందని అయితే నేటి వరకు నష్టం అంచనాలను రూపొందించడంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని పార్టీ నేతలు సమన్వయ కమిటీ దష్టికి తీసుకువచ్చారు. కోత కోసి ఓదెలపై ఉన్న పంట విషయంలో పరిహారము నమోదు చేసేందుకు అధికారులు నిబంధనల సాకులు చూపుతున్నారని, ఇప్పటివరకు మనకలు వచ్చినాయి ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్న విషయంలో రైతులలో ఆందోళన నెలకొని ఉందన్నారు. వర్షాల కారణంగా ఆరు మండలాలలో పలుచోట్ల చల్లిన మినుము కుళ్ళిపోయిందని దీనితో ప్రతి రైతు మరోసారి మినుము చల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా నేటి వరకు ముఖ్యమంత్రి చెప్పినట్లుగా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ ఎక్కడ ఏర్పాటు చేయలేదని పార్టీ నేతలు వ్యవసాయ విభాగం సభ్యులు తెలిపారు. నియోజక వర్గంలో జరిగిన డ్రైనేజీ పనుల్లో చోటు చేసుకున్న అవినీతి కారణంగానే ఎక్కువ పంట నష్టం జరిగిందని దీనిపై విచారణ జరిగాలా పార్టీ తరఫున ప్రభుత్వం పై ఒత్తిడి తేవలసి ఉందని నేతల అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్ రామ్, నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షులు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఘంటసాల మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, బండే శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు మోర్ల ప్రసాద్, ఎలక్ట్రోల్ సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు పాల్గొన్నారు

మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

లైఫ్‌స్టైల్‌లో ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: నగరంలోని లైఫ్‌స్టైల్ షోరూమ్‌లో అన్ని బ్రాండ్ల వస్త్రాలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు షోరూమ్ నిర్వాహకులు రామ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. షోరూమ్‌లోని దుస్తులు, గడియారాలు, పాదరక్షలు, కాస్మోటిక్స్, హ్యాండ్‌బ్యాగ్‌లు, ఆకర్షణీయమైన ధరల్లో లభ్యమవుతాయని తెలిపారు. ఐసిఐసిఐ, వన్ కార్డు క్రెడిట్ కార్డు హోల్డర్లకు కూడా ప్రత్యేక ఆఫర్ ఉందన్నారు. నగరంలోని ఒయాసిస్ సెంటర్‌లోని ప్రత్యేకంగా లైఫ్‌స్టైల్ షోరూమ్ నందు ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కేర్‌తో సుందరం ఫైనాన్స్ భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆర్థిక సేవల కంపెనీలలో అగ్రస్థానంలో ఉన్న సుందరం ఫైనాన్స్, ఆరోగ్య భీమా సంస్థ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేర్ హెల్త్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ అనూజ్ గులాటి ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా సుందరం ఫైనాన్స్ ఇపుడు వినియోగదారులకు వారికి కావాల్సిన విధంగా ఆరోగ్య సేవలను అందించేందుకు వివిధ హెల్త్‌ఇన్సూరెన్స్ స్కీమ్‌లను కూడా అందించనుందని తెలిపారు. ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే తాము కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో భాగస్వామ్యమైనట్లు ప్రకటించారు.

జాగ్వర్ ల్యాండ్ రోవర్ డిఫెండర్ జర్నీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: వినియోగదారుల కోసం జాగ్వార్ ల్యాండ్ రోవర్ ప్రత్యేకంగా డిఫెండర్ జర్నీలను ప్రారంభించనున్నట్లు జాగ్వార్ లాండ్ రోవర్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ రోవర్ కార్ల విశిష్టతను తెలియచేసేందుకుగాను ఈజర్నీని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రతి డిఫెండర్ జర్నీలో వినియోగదారుల కోసం విలాసవంతమైన ప్రయాణం‌తో పాటు ఆతిధ్యం, కార్ డ్రైవింగ్‌లో ఎక్స్‌పీరియన్స్‌ను తెలియచేసే విధంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జాగ్వార్ ల్యాండ్ రోవర్ సంస్థ కార్ల పట్ల ఆసక్తి కల వారికి జాగ్వర్ కార్ల కోసం ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమం జనవరి 16 నుండి ప్రారంభమవుతుందని అన్ని జాగ్వార్ డీలర్ల వద్ద పేర్లను నమోదుచేసుకోవడంతో పాటు వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

అతి వేగం ప్రమాదకరం : ఎంవిఐ

ప్రజాశక్తి-కంచికచర్ల: మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావద్దని మోటార్ వాహనాల తనిఖీ అధికారి సంగీతరావు సూచించారు. కంచికచర్ల బైపాస్ రోడ్డులోని అన్నపూర్ణ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ ఉద్యోగులు సంఘం జోనల్ అధికారి యం.రాజబాబుతో కలిసి ఎంవిఐ పాల్గొని శిక్షణ పొందుతున్న వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దూర ప్రాంతాలకు ప్రయాణ సమయంలో ప్రతి రెండు గంటలకు ఒకసారి 15 నిమిషాలు విశ్రాంతి తీసుకోవడం మంచిదన్నారు. అనంతరం శ్రీ అన్నపూర్ణ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ రూపొందించిన 2023 సంవత్సరం కేలండర్‌ను రాజబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ రవాణాశాఖ కార్యాలయం ఏవో ప్రభాకర్ లింగం, డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యం జి గోపీచంద్, బి నారాయణరావు, ప్రిన్సిపాల్ సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

ఎపికి పతకాల పంట

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జాతీయ పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మూడో రోజు బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజిలింగ్ పోటీల్లోని పలు విభాగాల్లో

ఆంధ్రప్రదేశ్‌కు పసిడి పతకాల పంట పండింది. వెయిట్ లిఫ్టింగ్ అండర్- 14 బాలికల విభాగంలో ఏపికి మూడు బంగారు పతకాలు వరించాయి. 44, 58, 63 కేజీల బాలికల కేటగిరీలలో ఏపీ బాలికలు విజయదుందుభి మోగించారు. 48, 53 కేజీల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ బాలికలే మూడో స్థానాలను సైతం కైవసం చేసుకున్నారు. ఏపికి చెందిన వంకునవత్ కళ్యాణి 56 పాయింట్లతో 44 కిలోల కేటగిరిలో పసిడి పతకాన్ని సాధించింది. 58 కేజీల కేటగిరిలో ఏపికి చెందిన పి.అంజలి బంగారు పథకాన్ని కైవసం చేసుకుంది. 63 కేజీల విభాగంలో పి.లోకేశ్వరి దివ్య కళ గోల్డ్ మెడల్ సాధించింది. 48,53 కేజీల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ బాలికలే మూడో స్థానాలను సైతం కైవసం చేసుకున్నారు. ఈ రెండు వరుస విభాగాల్లో సుజాత, పి.స్వప్న చివరి స్థానంలో నిలిచారు. పాయింట్ల పట్టికలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ 184 పాయింట్లతో ఓవరాల్ టీమ్ ఛాంపియన్‌ను కైవసం చేసుకుంది. 130 పాయింట్లతో ఏపి రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఒషిన్వామ్ టమ్రకర్ బెస్ట్ లిఫ్టర్‌గా గెలిచారు. బాడ్మింటన్ అండర్-14 విభాగంలో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన విక్రాంత్ ఠాకూర్‌కు కాంస్య పతకం. నగరంలోని ఆంధ్రా లయోలా కాలేజీలో జరుగుతున్న ఈఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే కలియతిరిగారు. క్రీడలన్నీ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అక్కడ క్రీడాకారులకు అందుతున్న వసతులు, అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు ఏ విధమైన లోటు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. దేశవ్యాప్తంగా క్షయ వ్యాధిని రూపుమాపేందుకు ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరం వద్ద క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కెనరా బ్యాంక్ రెండు లక్షల సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో 500 మంది క్షయ వ్యాధి బాధితులకు పౌష్టికాహారం కిట్లను అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. జిల్లాలో రెండు వేల మంది క్షయ వ్యాధి బాధితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.సమరం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యం సుహాసిని, జిల్లా టిబి కంట్రోలింగ్ అధికారి డాక్టర్ ఉషారాణి, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

23 నుండి నరెడ్కో ప్రాపర్టీ షో

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఈ నెల 23, 24,25 తేదీలలో నగరంలోని శేషసాయి కళ్యాణమండపంలో నరెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) 9వ ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్లు నరెడ్కో విజయవాడ ఛాప్టర్ అధ్యక్షులు అమరనాథ్ తెలిపారు. ఎల్ఐసి కాలనీలోని నరెడ్కో కార్యాలయంలో ప్రాపర్టీ షోకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అమరనాథ్ మాట్లాడుతూ సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే వారి కోసం అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. లోన్ సదుపాయం, నిర్మాణ సామాగ్రి సరఫరాదారులు ఈ ప్రాపర్టీ షోలో స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో సభ్యులు రత్నకుమార్ పలువురు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మదర్‌థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో కొండపల్లి కోటయ్యనగర్‌లో యువతకు కుట్టుశిక్షణను మంగళవారం ప్రారంభించారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ మరియు స్పోర్ట్స్ భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం విజయవాడ వారి సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలడుగు జ్యోత్స్న, నెహ్రూ యువ కేంద్రం ఎపిఎ బి.సీతారామ్, డిఎస్‌పి సుధాకరరావు పాల్గొన్నారు.

జిఒ 21 రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం

- సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్
- విజయవాడలో ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. డీజిల్ ఆటోలను గ్యాస్ ఆటోలుగా మార్చాలని, ఆటో, గ్యాస్ బండల క్లీనింగ్ సెంటర్‌ను విజయవాడలో ఏర్పాటు చేయాలని, వేలాది రూపాయలు జరిమానాలను విధించే జీఓ నెంబర్ 21ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రోజురోజుకీ ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆటో మోటార్ కార్మికులను ఆదుకోవాల్సింది పోయి అనేక రూపాల్లో సమస్యలు సృష్టిస్తున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో 1500కు పైగా ఉన్న డీజిల్ ఆటోలను గ్యాస్ ఆటోలుగా మార్చాలని, ఆటో గ్యాస్ బండల క్లీనింగ్ సెంటర్ విజయవాడలో ఏర్పాటు చేయాలని, వేలాది రూపాయలు జరిమానాలు విధించే జిఒ 21 రద్దు చేయాలని గతంలో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారు స్పందించలేదన్నారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో గ్యాస్ బండల క్లీనింగ్ చేయించుకోవాలంటే హైదరాబాద్, మధిర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందన్నారు. దీని వల్ల ఆటో కార్మికులపై అదనపు భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విజయవాడ తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. రూబెన్ కుమార్ అధ్యక్షత వహించగా విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగర నాయకులు డి.కోటయ్య, పి.తిరుపతయ్య, డి. కాశేశ్వరరావు, విజ్జి చిన్నారావు, బి.పైడిరాజు, డి.నూకరాజు, బి.ప్రసాద్, జి.శ్రీనివాసరావు, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు బీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.